దీన్నే నమ్ముకున్నాం.. దారి చూపించండి

- 30 ఏళ్లుగా పని చేస్తున్నాం.. ఇప్పుడు తొలగించడం అన్యాయం
- జీవనోపాధికి ప్రత్యామ్నయ మార్గం చూపండి
- రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో బాక్స్ బాయ్స్ ఆవేదన

రాజమహేంద్రవరం సిటీ: గత 30ఏళ్ల పని చేస్తున్నాం ఇదే జీవనాధారంగా బతుకుతున్నాం తమను తొలగించడం అన్యాయమని కనీసం ఉపాధికి ప్రత్యామ్నయ మార్గం చూపాలని రైల్వే స్టేషన్‌లో పనిచేసే బాక్స్ బాయ్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రైల్వే గార్డులకు (ప్రస్తుతం ట్రైన్ మేనేజర్లు) విధి నిర్వహణలో వినియోగించే వస్తువులతో ఏర్పాటు చేసిన ఐరెన్ బాక్స్‌లను తరలించేందుకు పది మంది బాక్స్ బాయ్స్ పని చేస్తున్నారు. వీరు రాజమహేంద్రవరం కేంద్రంగా రాకపోకలు సాగించే గూడ్స్, పాసింజరు, ఎక్స్‌ప్రెస్, సూపర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పని చేసే గార్డులకు సంబంధించిన బాక్స్‌లు రైళ్లకు లోడింగ్, అన్ లోడింగ్‌కు చేస్తుంటారు. రోజుకు నలుగురు వ్యక్తులు చొప్పున 12 గంటల డ్యూటీతో విధులు నిర్వహిస్తుంటారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఇద్దరు, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ మరో ఇద్దరు ఉంటారు. అయితే రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం)లో పని చేస్తున్న వీరిని తొలగిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా రైల్వే గార్డ్స్‌లకు(ట్రైన్ మేనేజర్లు) బాక్స్ లను తీసివేసి ట్రాలీలను ప్రవేశపెట్టింది. ఈ ట్రాలీ వలన బాక్స్ బాయ్స్ అవసరం లేదని ఆగస్టు 31న నిలిపివేయడంతో బాక్స్ బాయ్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ట్రైన్ మేనేజర్ల బాక్స్‌ల స్థానంలో ట్రాలీ ఉపయోగిస్తున్న దృశ్యం

అధికారులు ప్రత్యేక దృష్టి సారించి..

బాక్స్ బాయ్స్ సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 20న స్టేషన్ మాస్టర్‌ని కలిసి గార్డ్ బాక్స్‌లను తీసివేస్తే తాము ఉపాధి కోల్పోకుండా రైల్వేలో ప్రత్యామ్నయంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. చాలా కాలంగా బాక్స్ బాయ్స్‌గా పనిచేస్తున్నామని రైల్వే అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జీవనోపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే పని కల్పించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినా..

ఈ విషయంపై రాజమహేంద్రవరం స్టేషన్ మేనేజర్ రంగనాథ్‌ను వివరణ కోరగా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న బాక్స్ బాయ్స్‌ను తొలగించాలనే గత రెండేళ్ల క్రితం రైల్వే శాఖ ఉన్నతాధికారుల నిర్ణయించారు. అయితే రైల్వే గార్డ్స్ (ట్రైన్ మేనేజర్లు)అసోషియేషన్ బాక్స్ బాయ్స్ విధానం ఎత్తివేయ వద్దంటూ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిందని తెలిపారు. ఇటీవల ట్రిబ్యునల్ బాక్స్ బాయ్స్‌ను తీసివేసే చర్యలను అనుమతిస్తూ తీర్పు నిచ్చిందన్నారు. దీంతో గార్డులకు బాక్స్‌ల స్థానంలో విధి నిర్వహణలో ఉపయోగించే సామగ్రిని తరలించేందుకు ట్రాలీలను ఏర్పాటు చేసుకునేందుకు రూ.5000 మంజూరు చేసిందన్నారు. ఆదివారం నుంచి బాక్స్ బాయ్స్‌తో పని లేకుండా గార్డులు వారి సామగ్రిని ఉపయోగించి తీసుకుని వెళ్లేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు.



రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న బాక్స్ బాయ్స్(ఫైల్)

వేరే పని చేతకాక..



బాక్స్ బాయ్స్‌గా పనిచేయడమే తప్ప మరో పనిచేత కాదు. గత 20 సంవత్సరాలుగా ఇదే పని చేస్తున్నాను. ప్రత్యామ్నయ మార్గం చూపి జీవనోపాధి కల్పించాలి. ఇద్దరు పిల్లలు బాబు ఎనిమిదో తరగతి, పాప నాలుగో తరగతి చదువుతున్నారు. వారి భవిష్యత్తు అంధకారమైపోతుంది. జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ప్రత్యామ్నయం చూపి ఆదుకోండి.

– బంగారు శ్రీనివాసు

ఇదే వృత్తిలో ఉన్నా..



మూడు దశాబ్దాలుగా ఇదే పనిలో ఉన్నాను. ప్రత్యామ్నయ జీవనోపాధి కల్పించకుండా పని నుంచి తొలగించడం దారుణం. వృద్ధాప్యంలో ఈ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాను. పని నుంచి తొలగించడంతో భవిష్యత్ అంధకారంగా తయారవుతుంది. పిల్లను ఏటా పోషించుకుంటాం. ఇది లేకపోవడంతో అంతా అయోమయంగా కనిపిస్తోంది.

– ఉప్పాటి నాగేశ్వర రావు, బాక్స్ బాయ్

క్లుప్తంగా

అధికారులను అప్రమత్తం చేశాం

- కలెక్టర్ ప్రశాంతి
- కలెక్టరేట్‌లో 15 శాఖలతో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం క్షేత్రస్థాయిలో ఆమె పర్యటించారు. అనంతరం టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఇప్పటికే బలహీనంగా ఉన్న ఏటిగట్లు, కాలువ గట్ల పరిధిలో తగిన చర్యలు తీసుకున్నామన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఆ మేరకు పనులను చేపట్టి ఇసుక బస్తాలు వేసి గట్లను పటిష్టం చేశారన్నారు. అలాగే కలక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి మూడు షిఫ్టుల్లో 15 శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంచామన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులు ఆయా మండల ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచి పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

ముందస్తుగా ఇంటిని ఖాళీ చేయించిన అధికారులు


జేఎల్‌బీ నగర్‌లో తాటి పార్వతికి ఇల్లు ఖాళీ చేయమని చెబుతున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు ఝాన్సీలక్ష్మీబాయినగర్‌లో కొండచరియలు కింద ప్రమాదకరంగా ఉన్న ఇంటిని తహసీల్దార్, ఎంపీడీవోలు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండచరియలు జారే ప్రమాదం ఉండడంతో స్థానిక నాయకుడు మరడాపు రాంబాబు అధికారులకు తెలిపారు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్ రమ్య, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వీఆర్వో మృణాళిని అక్కడకు చేరుకున్నారు. కొండ కింద ఉన్న ఇంటిని పరిశీలించి, అందులో ఉంటున్న తాటి పార్వతిని వెంటనే ఖాళీచేయించారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ ఎస్టీయూ నిరసన


జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్టీయూ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: సీపీఎస్ రద్దు కోరుతూ రాష్ట్రం సంఘం పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు డేనియల్ బాబ్ మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితమే సీపీఎస్ రద్దు కోరుతూ ఢిల్లీలో మొట్ట మొదటి ఆందోళన చేసిన సంఘం ఎస్టీయూ అన్నారు. అయినప్పటికీ నేటికీ అది రూపాలు మార్చుకుంటూ ఉద్యోగులను మానసికంగా కుంగదీస్తుందే తప్ప అది అంతం కావడం లేదన్నారు. ఇది ఒక్క ఉపాధ్యాయుల సమస్య కాదని ఉద్యోగస్తులందరిదీ కాబట్టి పరిష్కారం కోసం ఉమ్మడి వేదిక అవసరం అని చిత్త శుద్ధి తో కలిసి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి అర్జునుడు, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడు తమలం పూడి ఈశ్వర్ రెడ్డి, వివిధ కమిటీల రాష్ట్ర కన్వీనర్లు, కార్యదర్శులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఉచిత దంత వైద్య శిబిరం

పెదపూడి: అనపర్తి మండలంలోని పొలమూరు గ్రామంలోని మూలారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ,జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. సుమారు 60 మంది డెంటల్ వైద్య నిపుణులో ఇంటింటికి వెళ్లి డెంటల్ వైద్య పరీక్షలు నిర్వహించి 13వేల మందికి డెంటల్ వైద్యం అవసరమని నిర్ధారించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు


అదుపులోకి తీసుకున్న నిందితులతో పోలీసులు

రంగంపేట: పేకాడుతున్న ఆరుగురి వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తోట కృష్ణసాయి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన రంగంపేట గ్రామ శివారులో పేకాడుతున్నట్టు తమకు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, రూ.3900 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతి


కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానంలో ఉత్సవ కమిటీలకు అనుమతులు మంజూరుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు అనుమతులు జారీ చేసేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ డిపార్టుమెంటు అధికారుల సమన్వయంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగంలో సోమవారం నుంచి 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఏపీఈపీడీసీఎల్, ఫిషరీస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ డిపార్టుమెంటు అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. నగర పరిధిలోని ప్రజలు, గణపతి నిర్వహణ కమిటీ సభ్యులు ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకొని సజావుగా వినాయక చవితి జరుపుకొని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

6న మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల ఆరో తేదీన వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేయనున్నారు.ఈ విషయాన్ని ఆ సంస్థ ప్రెసిడెంట్ పాల కృష్ణప్రసాద్ రెడ్డి, సెక్రటరీ ఉప్పల శ్రీను ఆదివారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్యామల టాకీస్ వద్ద ఉన్న సీపీరెడ్డి హీరో హోండా షోరూమ్ వద్ద మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలు భక్తులకు పూజా నిమిత్తం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక వైద్యశిబిరాలు కొనసాగుతాయి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక వైద్య శిబిరాలు మరి కొద్ది రోజులు కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని సంబంధిత పీహెచ్‌సీలు, యూపీహెచ్‌పీల వైద్యాధికారులు జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో 57 వైద్యశిబిరాలు నిర్వహించారన్నారు. 37,727 గృహాలలో 1,33,463 మందిని సర్వే చేయగా 2471 మందిని అవుట్ పేషెంట్ కేసులు ఉన్నట్టు గుర్తించి, వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో 235 మంది జ్వరాల లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. మలేరియా, డెంగీ, రేపిడ్ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. .

పాటించాల్సినవి

ఈ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. పాటించాల్సిన పలు సూచనలు చేశారు.

- ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి, చల్లారిన తర్వాత మాత్రమే తాగాలి.
- ప్రతిరోజు ఇంటలో వేడివేడి ఆహార పదార్థాలే తినాలి.
- వండినటువంటి ఆహారంపై శుభ్రమైన మూతలు ఉండాలి .
- మీ ఇంటిలో దోమలు కానీ, ఈగలు కానీ, ఏ క్రిమి కీటకాలు లేకుండా ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలి. – వంట, భోజనం చేసేందుకు ముందు, మలవిసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి.
- బయట ప్రదేశంలో వండిన వంటకాలు చిరుతిళ్లు (జంక్ ఫుడ్) గాని తినకూడదు.
- ప్రతి దినం ఇంటిలోని వారందరూ శుభ్రంగా స్నానం చేసి ఉతికిన బట్టలను ధరించవలెను
- ప్రతిరోజు విడిచిన బట్టలను శుభ్రంగా ఉతికి బాగా ఆరిన తర్వాత ధరించవలెను .
- మీ ఇంటిలో వృద్ధులుగాని, చిన్న పిల్లలు గాని, గర్భిణులు, బాలింతలు ఉంటే చల్లటి గాలిలో కానీ, వానలో కాని తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- మీ ఇంటి పరిసరాలను ఎలాంటి చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచుకొనవలెను .
- మీ ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉంటే గుంటలు తవ్వి మట్టితో కప్పి వేయాలి. లేదంటే మీ గ్రామ కార్యదర్శి గాని, సర్పంచ్ గాని సంబంధిత వార్డు మెంబర్లకు గాని తెలిపి మరమ్మతులు చేయించుకోవాలి.
- మీ ఇంటిలో గాని, మీ పరిసరాల్లో గాని, పాత టైర్లు, టెంకాయలు, పాత వాటర్ బాటిళ్లలో నీరు ఉంటే వెంటనే తొలగించాలి.
- వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం చేస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో మీరు సహకరించాలి.

– మీ ఇంటిలోనికి దోమలు ప్రవేశించకుండా ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు మీ ఇంటి తలుపులను, కిటికీలను మూసి వేయాలి.

- మీకు వ్యక్తిగత పరిరక్షణ కోసం మీ ఇంటిలో ప్రకృతిలో లభించి వేపాకుతో పొగ వేసుకుంటే మీరు దోమ కాటుకు గురికాకుండా రక్షణ పొందగలరు.
- మీరు రాత్రిపూట పడుకునేటప్పుడు పూర్తి శరీర రక్షణ కోసం ఫుల్ హాండ్స్ కలిగిన దుస్తులను ధరించాలి. .
- మీ ఇంటిలో కానీ, మీ చుట్టుపక్కల వారికి గాని ఎవరికైనా జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటే వెంటనే స్థానికంగా ఉన్న ఆశా కార్యకర్తకు గాని, ఏఎన్ఎం నకు గాని సమాచారం అందించాలి.
- మీకు ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా దగ్గరలోని పీహెచ్‌సీ లేక యూహెచ్‌పీ లేక మరి ఏ ఇతర ప్రభుత్వ వైద్యశాలలో అయినా పరీక్షలు చేయించుకోవాలి.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

- భావితరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి కేఎన్ జ్యోతి

రాజమహే ంద్రవరం రూరల్: జీవకోటి మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి, మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి అన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి పిలుపు మేరకు బొమ్మూరులోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళాసాధికార కేంద్రం(మహిళాప్రాంగణం)లో ఆమె మొక్కలు నాటారు. సంస్థ ఇన్‌చార్జి మేనేజర్, సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ తదితరులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం మొక్కలు నాటారు. మహిళా ప్రాంగణం సూపరింటెండెంట్ శ్రీదేవి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మహిళా ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధికారులు

అలరించిన ఆలయ నృత్యం



నృత్యం చేస్తున్న కళాకారులు

రాజమహేంద్రవరం సిటీ: విఖ్యాత నాట్య పండితుడు, నర్తన యోగిగా పేరొందిన డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ పునఃసృష్టి చేసిన ఆలయ నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. ఆదివారం శ్రీసద్గురు సన్నిధి నెలవారీ కార్యక్రమంలో భాగంగా గోదావరి గట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో డాక్టర్ సప్పా శిష్యులు 12 మంది ఆగమనర్తన రీతిలో ఆలయనృత్యాన్ని ప్రదర్శించారు. సప్పా పరిశోధనా ఫలం పంచభూత నర్తనం, బ్రహ్మ కడిగిన పాదం తదితర కీర్తనలు అద్భుతంగా నర్తించి నవరసాలు పండించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సద్గురు సన్నిధి స్థాపకులు మధుసూదన రావు తదితర ప్రముఖులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించి, 12 మంది నర్తకీమణులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

రాజానగరం: కోనసీమ జిల్లా, రామచంద్రాపురంలోని శారదా నర్సింగ్ హోమ్‌లో ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది ఆలపాటి సంధ్యాకుమారి. ఈమెది తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం మండలం, కొత్తతుంగపాడు గ్రామమని ఆ గ్రామ సర్పంచ్ కోలపాటి వెంకన్న తెలిపారు. ఈ గ్రామానికి చెందిన వీరబాబుకు రావులపాలెం సమీపంలోని సంధ్యాకుమారికి వివాహం జరిగి ఐదేళ్లు అయినాగాని, సంతానం లేకపోవడంతో కలత చెందేవారు. దుబాయ్‌లో పనిచేసే వీరబాబు నాలుగేళ్లుగా ఇక్కడే ఉంటున్నాడు. స్థానికంగానే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని చూసుకుంటున్నాడు. తనకు సంతానం లేదని కలవరపడేవాడు. ఈ తరుణంలో సంధ్యాకుమారికి ఒకేసారి ముగ్గురు పిల్లలు పుట్టడం ఆ కుటుంబంలో ఆనందోత్సాహాలకు హద్దులు లేకుండా ఉన్నాయి. ఈ ముగ్గిరిలో ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడ పిల్ల కావడం, తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉండడం ఆనందంగా ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. 1981 నుంచి 1984 బ్యాచ్ బీకాం విద్యార్థులు ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో ఆత్మీక కలయిక ఏర్పాటు చేసుకుని కలిశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా వచ్చి ఆనాటి తీపిగుర్తులు, మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు ఆ నాడు విద్య నేర్పిన అధ్యాపకులు సీహెచ్ కామేశ్వరరావు, లక్ష్మణ్‌లను సత్కరించి వారిపై తమకు ఉన్న అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి సంఘం వైస్‌చైర్మన్‌గా పని చేసిన రామచంద్రమూర్తి, జేపీఎం కృష్ణ, బాబ్జీ, అచ్చిరాజు, నగేష్, గుల్ల ఏడుకొండలు, కె.శ్రీనివాస్, సీహెచ్ నాగేశ్వరరావు, జి.వివేకానంద, ఢిల్లీ శ్రీను, ధర్మారావు, హనుమంతరావు, వెత్సా వీరాస్వామి, లక్ష్మీనారాయణ, ఉదయ్, మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కడియం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా మాదిరిగానే బుర్రిలంక ప్రాథమిక పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు చిరుసేవా సమితి వ్యవస్థాపకులు గెడ్డం శివరత్నగణపతి(శివ) తెలిపారు.

గ్రామాల్లో జ్వర పీడితులు

కడియం: సీజనల్ వ్యాధులతో విజృభిస్తుండడంతో ప్రభుత్వం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. ఈ వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహించగా ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతున్నట్ట బయటపడుతోంది. ఇప్పటికే వేమగిరి, కడియం, కడియపులంక, మాధవరాయుడు పాలెం తదితర గ్రామాల్లోని జ్వర పీడితులు శిబిరాలను ఆశ్రయిస్తున్నారు. ఆదివారం మండలంలోని జేగురుపాడు, పొట్టిలంక గ్రామాల్లో కూడా వైద్య శిబిరాలను నిర్వహించారు. జేగురుపాడు సచివాలయం–1, పొట్టిలంక సచివాలయం–1 పరిధిలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాల్లో మొత్తం 97 మందిని పరీక్షించగా వారిలో జేగురుపాడులో 12, పొట్టిలంకలో 6 మంది జ్వరంతో ఉన్నట్టుగా వైద్య సిబ్బంది గుర్తించారు. వీరికి డెంగీ, మలేరియా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ అందజేశారు. ఆయా శిబిరాల్లో డాక్టర్ ఎన్. నాగసాయిమౌర్య, డాక్టర్ జీ స్వరూప, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సేవలందించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పొట్టిలంకలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వరూప

నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలి

రాజమహేంద్రవరం సిటీ : నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. ఆదివారం నగరంలో 36, 37, 39 డివిజన్లలో లలితానగర్, ఆదెమ్మ దిబ్బ, కృష్ణా నగర్, లింగంపేట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరాభివృద్దే ధ్యేయంగా తాము పని చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే నగర అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. ప్రజలకు కావాల్సిన అన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సమస్యలు దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిదర్శనం రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్

- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నిబద్ధతకు నిదర్శనం రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సహాయ కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థల సహాయం ఎనలేనిదన్నారు. ఫౌండర్ సెక్రటరీ మతల రమేష్ మాట్లాడుతూ 2016లో ప్రారంభమైన తమ సంస్థ సామజిక సేవా కార్యక్రమాల్లో 8 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. తమ సంస్థ సాయం చేయడంలో పేదవారికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆర్యాపురం కోఆపరేటివ్ బేంక్ చైర్మన్ చల్లా శంకర రావు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర కూడా ప్రసంగించారు. ఈ సంవత్సరం ట్రస్ట్ తరపున ముద్రించిన వినాయక వ్రతకల్పం పుస్తకాన్ని సర్వేజనా సుఖినో భవంతు ట్రస్ట్ చైర్మన్ చిన వెంకన్న ఆవిష్కరించారు. చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయిలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తదితరులు

మెగా అభిమానుల సేవలు అభినందనీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మెగా బ్రదర్స్ అభిమానులు సేవలు అభినందనీయమని జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్‌లో రాష్ట్రచిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడిద బాబి, మెగాభిమానులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న అభిమానిని అభినందిస్తున్న అనుశ్రీ సత్యనారాయణ

సాక్షి - సినిమాలు



శ్యామల:	సరిపోదా శనివారం
సూర్యమినీ:	డిమోంట్‌కాలనీ–2
సూర్యప్యాలెస్:	సరిపోదా శనివారం
స్వామి:	సరిపోదా శనివారం
అశోక:	ఆయ్
శివజ్యోతి:	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ:	కమిటీకుర్రోళ్లు
రాజా:	సరిపోదా శనివారం
రంభ:	డబుల్‌ఇస్మార్ట్
ఊర్వశి:	తంగలాన్
మేనక:	రాయన్
కుమారి:	అహోవిక్రమార్క
అప్సర:	సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్.మహల్:	సరిపోదా శనివారం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ:	సరిపోదా శనివారం
కడియం	
వెంకటసూర్య:	సరిపోదా శనివారం